

నగరంలో సినీ నటి అమృత సందడి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో సినీ నటి అమృత అయ్యర్ సందడి చేశారు. శనివారం కాకినాడలోని దేవాలయం వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిఎంఆర్ జ్యువెలరీ మాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఆ బంగారు నగల దుకాణాన్ని సుమారు గంటపాటు పరిశీలించి నగలు ధరించి ఫోటోలకు ఫోజులిచ్చారు. సినీ నటి అమృత రాక సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ సమస్య లేకుండా క్రమబద్ధీకరించారు. అమృత అయ్యర్ ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన హనుమాన్ చిత్రంలో కథానాయకగా నటించింది. అమృతను చూసేందుకు పలువురు ఎగబడ్డారు.

ప్రచారానికి పవన్ కల్యాణ్ శ్రీకారం

- 4 రోజులపాటు పిఠాపురంలోనే బస
- మాజీ ఎంఎల్ఎ వర్మతో ప్రత్యేక భేటీ
- స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

పిఠాపురం నుంచి విజయ భేరి ఎన్నికల శంఖారావానికి శనివారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. ఏప్రియల్ రెండో తేదీ వరకూ ఆయన పిఠాపురం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గొల్లప్రోలు చేరుకున్న పవన్ కళ్యాణ్ తొలుత మాజీ ఎంఎల్ఎ, పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్‌ఎన్ వర్మ నివాసానికి నేరుగా వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. గొల్లప్రోలులో హెలికాప్టర్ దిగిన పవన్ కళ్యాణ్‌కు పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకుని ఘన స్వాగతం పలికారు. హెలిపాడ్ వద్ద కాకినాడ జనసేన పార్లమెంట్ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ, పెద్దాపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ తుమ్మల బాబు తదితరులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పిఠాపురం మండలంలోని దొంతమూరుకు రోడ్ షోలో పవన్ కళ్యాణ్ వెళ్లారు. దొంతమూరులో మాజీ ఎంఎల్ఎ వర్మ నివాసానికి చేరుకున్న టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆత్మీయంగా వర్మను పలకరించి పూల బొకే ఇచ్చి అభినందించారు. టిడిపి జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జ్ సుజయ కృష్ణ రంగారావు, వర్మతో కలిసి పవన్ కళ్యాణ్ గంటకుపైగా ఎన్నికల ప్రచార అంశాలు వ్యూహాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడికి భారీ సంఖ్యలో చేరుకున్న వర్మ అభిమానులకు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మీ అందరి ఆదరాభిమానాలు చూరగొన్న వర్మ తన కోసం అసెంబ్లీ సీటును త్యాగం చేశారని, ఆ త్యాగాన్ని తాను ఎప్పుడు మర్చిపోలేనని, వర్మకు కూడా తాను అదే స్థాయిలో ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

అనంతరం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. పొత్తు ధర్మం ప్రకారం తనను గెలిపించే బాధ్యత తీసుకున్న వర్మకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సరైన వైద్యం అందించడం కోసం మూడు మండలాల్లో మల్టీ స్పెషాలిటీ సేవలు అందేలా కృషి చేస్తానన్నారు. ఇక్కడి రైతులు, నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు తనకు తెలుసని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యు.కొత్తపల్లి సెజ్‌లో ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎంతమందికి ఉపాధి వచ్చిందో ఒక్కసారి ఆలోచించండన్నారు. గొల్లప్రోలులో ముంపు, చేబ్రోలులో పట్టు రైతులకు ఏమి చేశారని వైసిపి నేతలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలో ఉప్పాడ తీరం కోతకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పట్టు రైతులు, మిర్చి రైతులు నష్టపోతున్నారన్నారు. తనను ఓడించడానికి చిత్తూరు జిల్లా నుంచి మిథున్ రెడ్డి, మండలానికి ఒక కీలక నేతను పెట్టారన్నారు. తన దగ్గర అంతగా శక్తి లేకపోయినా ఎందుకంత కక్ష పెట్టుకున్నారని ప్రశ్నించారు. సుద్దగడ్డ ఆధునీకరణ లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రూ.175 కోట్లు నిధులు వచ్చినా ఎందుకు పనులు చేపట్టలేదని ప్రశ్నించారు. గడచిన ఐదేళ్లలో ఈ సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. తీర ప్రాంతం కోతకు గురవుతున్నా సరైన ప్రణాళికలు చేయలేకపోయారని విమర్శించారు. కోనపాపపేటలో రసాయన పరిశ్రమలు వల్ల మత్స్యకారులకు ఉపాధి పోతున్నా అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదన్నారు.

పిఠాపురం సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకుంటానన్నారు కాకినాడ పోర్టులో డీజిల్, డ్రగ్స్ మాఫియా నడుస్తోందన్నారు. అక్రమ బియ్యం వ్యాపారం జరుగుతూ పోర్టు అడ్డాగా మారిందని తీవ్ర విరుచుకుపడ్డారు. మాఫియా డాన్ అంటూ పరోక్షంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడిపై విమర్శలు గుప్పించారు. మత్స్యకారులను అవమానించేలా మాట్లాడుతున్నారని అటువంటి వ్యక్తిని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

తనను గెలిపిస్తే పిఠాపురం నియోజవర్గానికి రుణపడి ఉంటానని, ఇక్కడే ఇల్లు తీసుకుని నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటానని తెలిపారు. 54 గ్రామాల బాధ్యతను తీసుకుని అభివద్ధి చేస్తానని, అన్ని కులాలని సమానంగా చూసి, అన్ని మతాలను ఒకేలా గౌరవిస్తానని చెప్పారు. దేశం మొత్తం గర్వించేలా పిఠాపురాన్ని ఆధ్యాత్మిక రాజధానిగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ జగన్ అభివృద్ధిని చేసి చూపిస్తానని, పిఠాపురంలో పశువుల సంత అభివృద్ధి కృషి చేస్తానని, ఉప్పాడ జట్టీ నిర్మించడమే కాక తీరానికి రక్షణ కోసం ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఏలేరు ఆయకట్టు రైతాంగ సమస్యలు పరిష్కారం కృషి చేస్తానన్నారు. సుద్దగడ్డ ఆధునీకరణ వెంటనే చేపడుతామన్నారు. పిఠాపురంను సీడ్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఉద్యాన పంటల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మిర్చి, పట్టు రైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ సెజ్‌లో పరిశ్రమలను తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తామని, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయడం ద్వారా ఎంతో ఉపాధి లభిస్తుందన్నారు. టెంపుల్ హబ్‌గా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. మీ బిడ్డల భవిష్యత్తు కోసం నిలబడిన తనను గెలిపించాలని కోరారు.

పవన్ సభలో అపశృతి

చేబ్రోలు గ్రామంలో జరిగిన పవన్ వారాహి విజయ యాత్ర సభలో అపశృతి చోటు చేసుకుంది. పవన్ ప్రసంగిస్తుండగా జరిగిన తోపులాటలో ఒక బాలుడికి కాలు విరిగింది. దీంతో పాటు మరో నలుగురికి గాయాలు అయ్యాయి. వారిని వెంటనే వారిని వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి. ప్రసాద్

సిఎఎను సమర్థించే పార్టీలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - కాకినాడ

పౌరసత్వ సవరణ చట్టాన్ని సమర్థించే పార్టీలను దేశ సార్వత్రిక ఎన్నికల్లో ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా సదస్సు పిలుపు నిచ్చింది. శనివారం స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సిఎఎ - దాని పర్యవసానాలు' అనే అంశంపై వేదిక కన్వీనర్ సీనియర్ సిటిజన్ అయితాబత్తుల రామేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులోఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్(పిపి) మాట్లాడారు. పౌరసత్వ సవరణ చట్టం ద్వారా దేశ ప్రజలందరినీ దోషులుగా నిలిపి మత ప్రాతిపదికన నిర్దోషిత్వాన్ని తేల్చుకోవాలని చేస్తున్న కుట్రల వెనుక ఉగ్రవాద మతజాఢ్యం ఉందని విమర్శించారు. ప్రపంచం ఆరాధించే రాముడ్ని రాజకీయ రాముడుగా ఎన్నికల సిత్రాలు సృష్టించి సమున్నతంగా ఉన్న మతంలో భిన్న వర్గాలు సృష్టించడం రాజకీయ ప్రకోపంలో భాగంగా ఉందన్నారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిస్టీ మాట్లాడుతూ పౌరసత్వ సవరణ చట్టం వలన రాజ్యాంగంలో లౌకికత్వానికి తావు లేదనే ధోరణి తీసుకు వస్తున్నారని అన్నారు. సిఎఎను సమ్మతించే పార్టీలను మద్దతుగా నిలిచే అనుబంధ పార్టీలను దేశ సార్వత్రిక ఎన్నికల్లో సంపూర్ణంగా వ్యతిరేకించాలని కోరారు. సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్తా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో భారత రాజ్యాంగాన్ని అనుసరించి మత అహంకారాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. సీనియర్ న్యాయవాది జవహర్ ఆలీ ఇజాజుద్దీన్ మాట్లాడుతూ 75ఏళ్ల దేశ స్వాతంత్ర్యంలో కలిసివున్న సమ సమాజంలో ఇటు వంటి దుష్పరిణామాలు ఏర్పడతాయని ఊహించ లేదన్నారు. మతాల నడుమ, కులాల మధ్య సంఘీ భావం లేకుంటే ప్రగతి సాధ్యం కాదన్నారు. పౌరసత్వ సవరణ చట్టం భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భిన్నంగా ఉందని సదస్సు తీర్మానించింది. క్రైస్తవ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశీ బాలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ నరాల శివ, న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు జల్లూరి వేంకటేశ్వర్లు, ఇతర పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు సబ్బతి ఫణీశ్వరరావు, చింతపల్లి అజయ్ కుమార్, టి.రాజా, పి.శ్రీనివాసరావు, మలసాని శ్రీనివాసరావు, గంగాసూరిబాబు, నజీరుద్దీన్, దూసర్ల పూడి రమణరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రస్తుత వేసవిలో ఎక్కడైనా మంచినీటి సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. శనివారం వాటర్ వర్క్స్ అధికారులతో కలెక్టర్ నివాస్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ ప్రాంతంలోనైనా నీటి సమస్య ఎదురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990కు కాల్ చేయాలని సూచించారు. సత్వరమే నీటి సమస్యను పరిష్కరించి, ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని అందిస్తామని చెప్పారు. ప్రజలెవ్వరూ మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఇప్పటికే అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. రూ 1.28 కోట్ల ఖర్చుతో వేసవి కార్యాచరణను సిద్ధం చేశామని కమిషనర్ తెలిపారు.

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్

స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో పోరాడాలి

ప్రజాశక్తి - కాకినాడ

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో విద్యా విధానాలపై పోరాటాలు సాగించాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో జిల్లా విద్యా, వైద్యానిక శిక్షణ తరగతులు 2వ రోజు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వరహాల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'మతం' అనే పాఠ్యాంశంపై రాజశేఖర్ బోధించారు. స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో నేటి విద్యార్థినీ, విద్యార్థులు విద్యారంగ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. మనుషుల మధ్య మానవత్వం కలిగి ఉండాలని, మతం పేరుతో విద్యార్థులు విచ్ఛిన్నం కాకూడదని కోరారు. భారతదేశాన్ని 200 ఏళ్లపాటు పాలించిన బ్రిటిష్ వాళ్ళకి వ్యతిరేకంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్ర బోస్, చంద్రశేఖర్ ఆజాద్, గాంధీ వంటి ఎందరో వ్యక్తులు తమ ప్రాణాల సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారని అన్నారు. అదే స్ఫూర్తితో దేశంలో ఉన్న పేద, మధ్యతరగతి విద్యార్థులందరికీ ఉచితంగా విద్యను అందించడం కోసం, అందరికీ విద్యా ఉపాధి కోసం పోరాడాలని కోరారు. విద్యార్థులు నేటి సమాజంలో మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. మతం వ్యక్తిగతంగా ఉండాలని, మతతత్వవాదులను, మతాన్ని విద్యారంగంలో చొప్పించే విధానాలను విద్యార్థులు తిప్పికొట్టాలని అన్నారు. అలాగే స్వాతంత్రోద్యమంలో విద్యార్థుల పాత్ర అనే పాఠ్యాంశాన్ని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రాజా బోధించారు. ఈ తరగతుల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, జిల్లా నాయకులు వాసు, సిద్ధు, గోపాల్, లోవరాజు, చిన్ని, అమృత, పావని, కృప ,సిరి, సుబ్రహ్మణ్యం, కరుణాకర్, విశాల్ పాల్గొన్నారు.

నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల సంఘం మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలని నోడల్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై పూర్తి అవగాహన తెచ్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఇందుకోసం కావలసిన పరికరాలు, సామాగ్రిని సమకూర్చుకోవాలన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన మాన్యువల్ పుస్తకాలను, సూచనలను, మార్గదర్శకాలను యధాతధంగా తప్పకుండా అనుసరించాలన్నారు. ప్రతిరోజు ఎన్నికల సంఘం తాజాగా అనేక సంస్కరణలు, సూచనలు జారీ చేస్తుందని, వాటిని దృష్టిలో పెట్టుకుని అమలు చేయాలన్నారు. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం పనికిరాదని స్పష్టం చేశారు. ఏదైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగాన్ని సంప్రదించాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను ఓటరు తెలుసుకునే కార్యక్రమాన్ని బిఎల్ఒలు పక్కాగా చేపట్టి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ప్రోత్సహించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను సీ విజిల్ యాప్ ద్వారా 24 గంటల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎఫ్ఎస్‌టి టీములు మూడు షిఫ్ట్‌లలో నియమించాలని, ఒక వారం ఒక షిఫ్ట్‌లో పని చేసిన వారు రెండో వారంలో వేరే షిఫ్ట్‌కి మార్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సి-విజిల్‌లో వచ్చే ఫిర్యాదులు పరిష్కరించేందుకు అధికారులు స్పెషల్ ఫోకస్ పెట్టాలన్నారు. సువిధ యాప్‌లో అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ డి.తిప్పే నాయక్, సిపిఒ పి.త్రీనాథ్, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డిపిఒ కె.భారతి సౌజన్య, జిల్లా ఆడిట్ అధికారి వై.సురేష్ బాబు, రవాణా శాఖ కమిషనర్ ఎ.మోహన్, డిపిఆర్ఒ డి.నాగార్జున, డిఎస్ఒ ఎంవి ప్రసాద్, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎస్.సప్న, ఎపిఎస్ఆర్‌టిసి ఆర్ఎం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

ఘనంగా రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

రన్ ఫర్ జీసస్ ర్యాలీలో క్రైస్తవులు

మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ నిర్వహించిన కార్యక్రమంలో వేలాదిగా క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు, వైసిపి నాయకుడు దవులూరి సుబ్బారావు, మండల పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు రెవ. డాక్టర్ ఎం.సాల్మన్ రాజు, కార్యదర్శి రెవ. డాక్టర్ వి.జాన్, కోశాధికారి రెవ.ఆర్.లాజరస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజేష్, క్రిస్టియన్ మైనార్టీ సంఘ రాష్ట్ర నాయకులు మడికి మేరీ సోనియా, ఎం.జానీ మోజెస్, కో అప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్, కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, పాలికి కుసుమ చంటిబాబు, మండల పాస్టర్ల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం జరిగింది. స్థానిక లూథరన్ హైస్కూల్ వద్ద ఈ ర్యాలీని కో-ఆర్డినేటర్ డాక్టర్ లంక పురుషోత్తమ దాస్, డాక్టర్ విజయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డి.వెంకటపాల్, బి.విద్యాసాగర్, తలారి విజయ్‌కుమార్, పరంజ్యోతి, ప్రతిభా స్కూల్స్ చైర్మన్ ఎస్‌వివి.ప్రకాష్ పాల్గొన్నారు.

దేవాలయానికి రూ 3.38 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక రోజు రూ.3.38 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ టిక్కెట్ల ద్వారా రూ 2,26,700, అన్నదాన విరాళాల ద్వారా రూ.41,444, కేశఖండన ద్వారా రూ 8,240, తులాభారం ద్వారా రూ.400, కానుకల ద్వారా రూ.251 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణచార్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జె.నివాస్‌ను శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌పి

ఎంపిపికి చిన్నయ్య దొర పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

పితృవియోగం పొందిన సామర్లకోట ఎంపిపి బొబ్బర సత్తిబాబును వైసిపి నాయకుడు డాక్టర్ గోరకపొడి చిన్నయ్య దొర పరామర్శించారు. ఎంపిపి సత్తిబాబు తండ్రి ఎర్రయ్య ఇటీవల మరణించారు. శనివారం మండలంలోని వేట్లపాలెం గ్రామంలో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీసత్యనారాయణ, ప్రసన్న, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఎంపిపితో మాట్లాడుతున్న చిన్నయ్యదొర

కార్టూ'నిజం'



బాల్య వివాహాల నిరోధంపై కళాజాతా

ప్రజాశక్తి - పెద్దాపురం

బాల్య వివాహాల నిరోధంపై కళాజాతను ప్రదర్శించారు. శనివారం స్థానిక కొండయ్య పేట గోలి చిన్న కొండయ్య మున్సిపల్ స్కూల్ వీధిలో బాల్యవివాహాల అనర్థాలపై అవగాహనా కళాజాతా ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష పర్యవేక్షణలో సూపర్‌వైజర్ ఎ.చంద్రకళ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బుర్ర కథ కళారూపం ఆకట్టుకుంది. ఈ కళారూపం ద్వారా బాల్యవివాహాల వల్ల అనర్థాలపై తల్లిదండ్రులకు, బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ చంద్రకళ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, బాల్య వివాహాలు నిర్వహించే వారిపై కేసులు వంటి వాటి పై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే సమీపంలోని సచివాలయం, అంగన్‌వాడీ సెంటర్ బాధ్యులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

టిడిపిలో చైర్‌పర్సన్ సత్యవతి చేరిక

నారా లోకేష్‌తో చైర్‌పర్సన్ సత్యవతి, టిడిపి అభ్యర్థి వరుపుల సత్యప్రభ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైసిపి తుని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు అలమండ చలమయ్య టిడిపిలో చేరారు. శనివారం హైదరబాద్‌లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో వారు టిడిపి కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సత్యప్రభ, కౌన్సిలర్లు మూదీ నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, పెంద్ర శ్రీను, కోణాల వెంకటరమణ, యండగుండి నాగబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాత్సవాయి సూర్యనారాయణ రాజు, నాయకులు పాండ్రంకి అప్పారావు, రుచి రమేష్, అలమండ వీర రాఘవరావు ఉన్నారు.

ఓటు హక్కు ప్రజల వజ్రాయుధం

ప్రజాశక్తి - పెదపూడి

అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేపిస్తున్న తహశీల్దార్

ఓటు హక్కే మన వజ్రాయుధమని తహశీల్దార్ కె.రాజకుమార్ అన్నారు. శనివారం మండలంలోని పెదపూడి, దోమడ గ్రామాల్లో అవగాహన కోసం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఓటుహక్కును ప్రతిఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఏప్రియల్ 15లోగా దరఖాస్తు చేసుకుని ఓటుహక్కు పొందాలన్నారు. ఓటుహక్కును వినియోగించుకుని ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డి టిఎన్.సత్యనారాయణ, ఆర్ఐ ఎం.త్రివేణి, బిఎల్ఒలు, సచివా లయ సిబ్బంది పాల్గొన్నారు.

నోటి శుభ్రతతోనే మంచి జీర్ణ వ్యవస్థ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నోరు జీర్ణవ్యవస్థకు ముఖ్య ద్వారమని, నోటి ప్రక్షాళనతో చక్కని జీర్ణవ్యవస్థ ఏర్పడుతుందని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ సాయికార్తీక్ అన్నారు. శనివారం బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ నోటిలోని ఏ భాగం వ్యాధిగ్రస్తమైనా దాని ప్రభావం మన జీర్ణ వ్యవస్థపై చూపుతుందన్నారు. చిగుళ్ల మీద పుండ్లు ఏర్పడినా, బ్యాక్టీరియాతో వ్యాధిగ్రస్తమైనా, చీము పట్టినా, దంతాలలో రంధ్రాలు ఏర్పడినా, దంతాలు పుచ్చినా, నోటిలో లాలాజలం సరిగా ఊరకపోయినా జీర్ణశక్తి దెబ్బతింటుందని అన్నారు. దంతాల గట్టిదనానికి ఏ ఆహారం తీసుకున్నా, ఏది తాగినా నోటిని నీటితో పుక్కిరించాలని అన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం బ్రష్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, చంద్రరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

150 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

నాటుసారా రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 150 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ బి.తులసీధర్ తెలిపారు. ఎస్‌ఐ టి.కృష్ణసాయి, సిబ్బంది కుమార్, రాహుల్‌తో కలిసి జేగురుపాడు పాముల మెట్ట రైల్వే గేట్ దగ్గర్లో అక్రమంగా నాటు సారా రవాణా చేస్తున్న వ్యక్తిని కాపుకాచి అరెస్టు చేసినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఎర్ర గోవిందును అరెస్టు చేసి అతని వద్దనుండి 50 లీటర్ల నాటుసారా, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచి నట్టు తెలిపారు.

పేపర్ మిల్లులో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - కడియం

జేగురుపాడు గ్రామ శివారులో ఉన్న మెహర్ గాయత్రీ దేవి క్రాఫ్ట్ పేపర్స్ ఎల్ఎల్‌పి పేపర్ మిల్‌లో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. పేపర్ మిల్ జనరల్ మేనేజర్ కంఠంశెట్టి మణికార్జునరావు శుక్రవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదుపై కడియం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సిఐ తులసీధర్ తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి ఎం.అంబికాప్రసాద్‌తో కలిసి శనివారం సందర్శించి ప్రాంతాన్ని పరిశీలించినట్టు ఆయన తెలి పారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉన్నాయన్నారు.

మొక్కులు తీర్చుకోవడానికి వచ్చి..

ప్రజాశక్తి- తాళ్లపూడి

ఉపవాస ప్రార్థనలు పూర్తి చేసుకుని మొక్కు తీర్చుకోవడానికి వేగేశ్వరపురం గ్రామానికి వచ్చిన వ్యక్తి గోదావరి నదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందారని ఎస్ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా చాట్రాయి మండలానికి చెందిన బొంగుది పోతయ్య తన కుటుంబ సభ్యులతో శనివారం తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో గోదావరి మేరి మాత ఆలయానికి మొక్కుబ తీర్చుకునేందుకు వచ్చారు. తన కుమారుడు పుల్లారావు, స్నేహితులతో కలిసి గోదావరి నదిలో స్నానం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పుల్లారావు నీటిలో మునిగి పోయారు. మృతుని తండ్రి పోతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పుల్లారావు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆలయానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గిడ్డజాం గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగాలమ్మ ఆలయ నిర్మాణ పనులకు, అన్నవరం దేవస్థానానికి చెందిన బ్రాహ్మణ చైతన్య యువజన పార్టీ నాయకులు గొంప శివకుమార్ శనివారం రూ.10 వేలు విరాళాన్ని అందచేశారు. సంబంధిత విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు పంపనబోయిన శ్రీనుకు అందచేశారు.

టిడిపి ఆధ్వర్యంలో 'జయహో బిసి'

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు త్రినాధ్‌రావు అధ్యక్షతన జయహో బిసి కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ 1, 2, 3ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా టిడిపి సీనియర్ నాయకుడు గుత్తుల సాయి పాల్గొని మాట్లాడుతూ టిడిపి స్థాపించిన దగ్గర నుంచి బిసిలకు పెద్దపీట వేసిందన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం బిసి కార్పొరేషన్, బిసిలకు సబ్ ప్లాన్ మరియు ఆదరణ పథకం ద్వారా పనిముట్లు గిఫ్ట్ కార్డులను 50 సంవత్సరాలకు పెన్షన్ ఇచ్చిందన్నారు. బిసిలకు స్థానిక సంస్థలలో 24 శాతం రిజర్వేషన్ కల్పించి గుర్తింపు తెచ్చిందన్నారు. నేడు వైసిపి వీటిని తొలగించి స్థానిక సంస్థలలో 10 శాతం కోత పెట్టి 16 వేల స్థానిక పదవులు కోల్పోయేలాగా చేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గొల్లకోటి దొరబాబు, చెల్లి అశోక్, పిల్లి నాగరాజు, దంగేటి శ్రీనివాసు, యల్ల ఉదయ్, చిక్కాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన యుకెజి విద్యార్థులు

'ఎంపిఎస్'లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-మండపేట

స్థానిక ఎంపిఎస్‌లో కిండర్ గార్డెన్ విద్యను ముగించి ప్రాథమిక విద్యలో అడుగుపెడుతున్న యుకెజి విద్యార్థులందరికీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ వల్లూరి చిన్నారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి జీవితంలో ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. యుకెజి విద్యను ముగించుకున్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులచే గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎల్‌కెజి, మొదటి, రెండవ తరగతి విద్యార్థుల నత్యప్రదర్శన తల్లిదండ్రులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డుపై గొయ్యిని పూడ్చాలి

ప్రజాశక్తి - మండపేట

నిత్యం రద్దీగా ఉండే స్థానిక సత్యశ్రీ రోడ్డు చింతాల జానకిరామా పిల్లల హాస్పిటల్ కు వెళ్లే వీధి సమీపంలో రోడ్డుకు గొయ్యిపడింది. ఈ నేపధ్యంలో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే స్థానికులు తాత్కాలికంగా రాళ్లు మట్టి సంచులతో కప్పి ఉంచారు. ఈ రహదారిని అనుకుని రెండు ఆసుపత్రులు, ఒక ప్రభుత్వ పాఠశాల ఉంది. దీంతో విద్యార్థులు, వాహనదారులు, రోగులు నిత్యం తిరుగుతుంటారు. ఈ నేపధ్యంలో ఎటువంటి ప్రమాదం జరుగకముందే అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు చెంతనే ఉన్న ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

అసంతృప్తులు...బుజ్జగింపులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అధికార వైసిపి, విపక్ష టిడిపిలో ఎంఎల్‌ఎ అభ్యర్థుల ఎంపిక ఆయా పార్టీల అధిష్టానాలకు తలనొప్పిగా మారింది. టిక్కెట్టు ఆశించి భంగపడ్డ ఆశావహుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. నేటికీ అసంతృప్తివాదుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతున్న నేపధ్యంలో ఆయా పార్టీల అధిష్టానాలు బుజ్జగింపుల చర్యలకు దిగింది. అయితే ఆశావహుల నుంచి ఏ మేరకు మద్దతు ఉంటుందో అర్థం కాని పరిస్థితిలో టిక్కెట్టు పొందిన అభ్యర్థులు ఉన్నారు.

2024 సార్వత్రిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అధినేతలు పావులు కదుపుతున్న విషయం విధితమే. ఈ నేపధ్యంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సామాజిక బలం కంటే ఆర్థిక బలమే కీలకంగా మారింది. దీంతో రెండు పార్టీల్లోనూ ఆశించి భంగపడిన వారి జాబితా చాంతాడులా పెరిగిపోతోంది. పిఠాపురం అసెంబ్లీ సీటు రాకపోవటంతో మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ భగ్గుమన్న విషయం విధితమే. ఆ పార్టీ అధినేతతో చర్చించిన అనంతరం స్వరం మార్చారు. పవన్ కళ్యాణ్ గెలుపుకోసం కృషి చేస్తానంటూ ప్రకటించారు. తాజాగా అనపర్తి సీటు బిజెపికి కేటాయించడంతో మాజీ ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆ నియోజక వర్గంలోని టిడిపి నేతలు భగ్గుమనటం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. టిడిపి జోన్-2 కో ఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు నేతృత్వంలో మాజీ మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప, తదితరులు రంగంలోకి దిగారు. నల్లమిల్లిని బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ సానుకూల పరిస్థితులు లేకపోవటంతో వెనుతిరిగారు. అయితే త్వరలోనే అధినేత నుంచి పిలుపు అందుతుందని తెలుస్తోంది. ఆ నల్లమిల్లి ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. కొవ్వూరు నియోజకవర్గం సీటును టిడిపి ముప్పిడి వెంకటేశ్వరరావుకు కేటాయించడంతో మాజీ మంత్రి కెఎస్ జవహర్ మండిపడ్డారు. తాజాగా ఆ పార్టీలో జాతీయ కార్యదర్శి పదవి అప్పగించడంతో కొంత శాంతించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా అధికార పార్టీలోనూ జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు స్థానంలో తోట నరసింహంకు సీటు కేటాయించారు. ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు బదులుగా వరుపుల సుబ్బారావుకు టికెట్ కేటాయించారు. అధినేత పిలుపుతో ప్రచారానికి హాజరవుతున్నప్పటికీ పూర్తి స్థాయి సహకారం అందేనా అనే మీమాంశ అభ్యర్థులను వెంటాడుతోంది. ఇటువంటి ఉదాహరణలు పిఠాపురం, పి.గన్నవరంలోనూ ఉన్నాయి. నూతన అభ్యర్థుల భవితవ్యం అసంతృప్తుల ఉన్న నియోజక వర్గాల్లో ఎలా ఉండబోతోందో వేచి చూడాల్సి ఉంది.

గోదారి గలగలలు

కలిపే గామన్ వంతెన 57-58 పిల్లర్ల మధ్య కుంగటంతో అధికార యంత్రాంగం ఉలిక్కి పడింది. ఉన్నతాధికారుల బృందం పర్యటించిన అనంతరం 15 రోజులలో అందుబాటులోకి తెస్తామని ప్రకటించటంతో ప్రజలకు కొంత ఊరట లభించినట్లయింది. అయితే ఆచరణలో ఏ మేరకు అందుబాటులోకి తెస్తారో వేచి చూడాలి. గామన్ వంతెన నిర్మాణం నాటి నుంచి జరిగిన పరిణామాలు నాణ్యతను ప్రశ్నిస్తున్నాయి. గతంలో అప్రోచ్ రోడ్డు కుంగిపోయిన విషయం విధితమే. వంతెన నిర్మాణ సంస్థ గక కొన్నేళ్ల ప్రయాణికుల నుంచి టోల్ వసూలు చేస్తున్నప్పటికీ నిర్వహణ బాధ్యతలు సక్రమంగా చేపట్టకపోవటమే ఈ దుస్థితి కారణమని తెలుస్తోంది. మరోవైపు వంతెనకు ఇరువైపులా జరుగుతున్న ఇసుక డ్రెడ్జింగ్ కూడా ఒక కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిల్లర్లకు 500 మీటర్ల వెలుపల ఇసుక తవ్వకాలు చేపట్టకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవటం లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి ఇసుక తవ్వకాలకు కళ్లెం వేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

పిల్లర్ కుంగుబాటుతో ఉలికిపాటు

ఉభయ గోదావరి జిల్లాలను

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా 35 డిగ్రీల నుంచి 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతోంది. దీంతో ఎండల తీవ్రత పెరుగుతోంది. దీంతో వాహన చోదకులు, రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు ఇబ్బందులు నడుమ దినచర్యను కొనసాగిస్తున్నారు. మార్చిలోనే ఈ విధంగా ఉంటే మే నెలలో ఎలా ఉంటాయో..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు విద్యుత్ వినియోగం పెరిగిందనే సాకుతో విద్యుత్ శాఖ అప్రకటిత విద్యుత్ కోతలకు తెర తీసింది. ఉదయం రాత్రి వేళలో విద్యుత్ కోతలు పరిపాటిగామారాయి. అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న ఇండో- అమెరికన్ సైనిక విన్యాసాలు

కాకినాడ సాగర తీరంలో నిర్వహించిన ఇండో - అమెరికన్ సైనిక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. టైగర్ ట్రయాంఫ్-24 పేరిట ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 18న విశాఖలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ముగింపు 27న కాకినాడలో నిర్వహించారు. సుమారు 1000 మందికిపైగా సిబ్బంది, అత్యాధునిక విమానాలతో చేపట్టిన విన్యాసాలు ఇండో - అమెరికన్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.

మరుగున పడ్డ పారిశుధ్య వాహనాలు

- తుప్పు పడుతున్న ప్రజాధనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లాలో 2వ పెద్ద మున్సిపాలిటీ సామర్లకోట. పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ఐదేళ్లుగా లక్షలాది రూపాయల ప్రజాధనంతో విలువైన వాహనాలను మున్సిపల్ అధికారులు కొనుగోలు చేశారు. పారిశుధ్య నిర్వహణకు వినియోగించిన పలు వాహనాలకు చిన్నపాటిగా వచ్చిన మరమ్మతులతో ఆ వాహనాలు మూలనపడ్డాయి. దీంతో వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో తుప్పుపట్టిపోతున్నాయి.

మున్సిపాలిటీలో 31 వార్డులు ఉండగా ఇక్కడ నానాటికి జనాభా పెరుగుతుండగా పారిశుధ్య నిర్వహణ

తుప్పు పడుతున్న చెత్త సేకరణ వాహనాలు

జనాభాకు తగ్గట్టు పెరగాల్సి ఉండగా అంతకంతకు దిగజారి పోతుంది. లక్షలాది రూపాయలు వెచ్చించి సమకూర్చిన 'ఈ'ఆటోలు, ట్రాక్టర్లు, హైడ్రాలిక్ వాహనం వంటి పారిశుధ్య వాహనాలకు తుప్పు పడుతున్నాయి. మున్సిపల్ అధికా రులు వాటిని పట్టించుకోకుండా మూలన పెట్టేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న మెప్మా భవనం ఖాళీ స్థలంలో ఈ వాహనాలను నిర్లక్ష్యంగా వదిలేశారు. దానితో అవి ఎండకు ఎండి, వానకు తడు స్తూ పాడవుతున్నాయి. లక్షలాది రూపా యలు వెచ్చించి కొన్న పారిశుధ్య వాహనాలు నిరుపయోగంగా పడి ఉండటం పట్ల పలువురు అధికార పార్టీ కౌన్సిలర్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య ధోరణిని ప్రశ్నిస్తున్నారు. వాహనాలు తుప్పుపట్టడంతోపాటు పారిశుధ్య వాహనాలు పారిశుధ్య నిర్వహణ పట్టణంలో ఉందని, సిబ్బందిని సంబంధం లేని విధుల్లో ఉంచడంతో వార్డుల్లో చెత్త కుప్పలు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అంటు వ్యాధులు ప్రబ లే విధంగా పారిశుధ్య నిర్వహణ పట్టణంలో ఉందని, ప్రజలతో పాటు అధికారపక్ష కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులను సైతం చేయించ చకుండా వాహనాలను వదిలిపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై సత్వరమే అధికారులు స్పందించి వాహనాలకు మరమ్మతులు చేపట్టి, పారిశుధ్య

నిరుపయోగంగా పడి ఉన్న 'ఈ' ఆటో లు

సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాలని, సిబ్బందిని పట్టణంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని అధికారపక్ష సభ్యులు హెచ్చరిస్తున్నారు. గతంలో సామర్లకోట మున్సిపాలిటీకి ఒక సానిటరీ సూపర్‌వైజర్, ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉండేవి. ప్రస్తుతం ఒక సానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్ట్‌ని కూడా ఇన్‌ఛార్జ్‌కి అప్పగించారు. రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కూడా లేరు. పట్టణ పరిధిలో వార్డు శానిటేషన్ సెక్రటరీలు ఉన్నప్పటికీ వారి పని చేస్తున్నారో కూడా ఎవరికి అర్థం కాని పరిస్థితి ఉంది. విలీనాల నివసించే ప్రాంతాలు, మున్సిపల్ కార్యాలయం, స్టేషన్ సెంటర్ తప్ప మిగిలిన ప్రాంతాల్లో అపారిశుధ్యం తాండవిస్తుందని ప్రజలు వాపోతున్నారు. వ్యాధులు ప్రబలకముందే మున్సిపల్ అధికారులు, పాలకులు పారిశుధ్య చర్యలు మెరుగు పరచేవిధంగా తగు చర్యలు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు, ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కిర్లంపూడి, తాళ్లరేవు, సామర్లకోట

కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో టిడిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోసం ఆయన కుమార్తె తోట సునీత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమం కాళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సునీత ఇంటింటికీ వెళ్లి టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి, జడ్‌పిటిసి సభ్యులు తోట గాంధీ, టిడిపి నాయకులు చదరం చంటిబాబు, కుర్ల చిన్నబాబు, గురాల రాంబాబు, వీరం రెడ్డి కాశీబాబు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండలంలోని గాడిమొగ పంచాయతీ పెదవలస గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు టిడిపిలో చేరారు. పలువురు ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు పాల్గొని వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకార నాయకులు బలం నాగేశ్వరరావు, లంకె నూకరాజు, సంగాడి కామేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి పాల్గొన్నారు. అలాగే సామర్లకోట పట్టణంలోని 22వ వార్డులో టిడిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు నిమ్మకాయల రంగనాగ్, విత్తనాల వెంకటరమణ, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, సరోజ, బిక్కిన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమోదం లేకుండా నియామకాలా..?

-అధికారులను నిలదీసిన పాలకవర్గ సభ్యులు

ప్రజాశక్తి - పిఠాపురం

కౌన్సిల్ పాలకవర్గం ఆమోదం లేకుండా అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగాల భర్తీని ఎందుకు చేపట్టారని పాలకవర్గ సభ్యులు అధికార యంత్రాంగాన్ని నిలదీశారు. శనివారం స్థానిక కౌన్సిల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తొలిత కౌన్సిలర్లు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. దీనిలో భాగంగానే పట్టణంలో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, వేసవి కాలం ప్రారంభమవడంతో ప్రజలకు తాగునీటిని అందించలేకపోతే, వేసవి తీవ్రత పెరిగితే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైవర్ల కాలనీలోని మంచినీటి నిర్వహణ అత్యంత దారుణంగా ఉందని, పైపులైన్ల ద్వారా మురుగునీరు వస్తుందని, అయినా యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలపై అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నను పారిశుధ్యం, మంచినీటి నిర్వహణ అత్యంత దారుణంగా ఉంటుందని కౌన్సిలర్ బోనసు కోటేశ్వరరావు అన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పుడు కొత్త పైప్ లైన్లు ఏర్పాటు చేయలేమని, కాని ఎండా కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామని కమిషనర్ కనకారావు సమాధానం ఇచ్చారు. కౌన్సిల్ సభ్యుల ఆమోదం లేకుండా అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగులను ఏవిధంగా నియమించారని కౌన్సిలర్ సోమరౌతు లలిత ప్రశ్నించారు. కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం లేకుండా, తీర్మానం చేయకుండా ఉద్యోగుల నియామకాలు ఎలా చేశారు? ఇందుకు ఉన్న నియమ, నిబంధనలు చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీకి సేవలు అందించి కరోనా సమయంలో మరణించిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు

వైస్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

ప్రాధాన్యత ఇవ్వకుండా అధికారులు తమకు నచ్చిన వారికి ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందని, నియామకాలపై పలు అనుమానాలు ఉన్నాయని, రానున్న గాలు కల్పించడంలో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణలు ఉన్నాయని మరో కౌన్సిలర్ బి.రేవతి ఆరోపించారు. ఈ ఉద్యోగాలు ఏ విధంగా నియమకం చేసుకున్నారనే విషయంపై పూర్తిగా కౌన్సిల్ సమావేశంలో చర్చించాలని పట్టుబట్టారు. ఈ సమావేశంలో 24 మంది కౌన్సిల్ సభ్యులు సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని వైస్ చైర్‌పర్సన్‌కు అందచేశారు.

సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదులపై అవగాహన

ప్రజాశక్తి - మండపేట

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సి-విజిల్ యాప్ లో వచ్చే ఫిర్యాదులపై అవగాహన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ, జిల్లా నోడల్ అధికారి రాంబాబు, తాసిల్దార్ సురేష్ కుమార్, మండల విస్తరణ అధికారి రాజులు పాల్గొన్నారు. మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలకు మూడు షిఫ్టులగా వేసిన 9 మంది సి. విజిల్ టీం లీడర్స్, సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలువురు మాట్లాడుతూ సివిజల్ యాప్ లోకి వచ్చిన ఫిర్యాదులు వచ్చిన తక్షణమే అక్కడికి ఏ విధంగా చేరుకుని పరిష్కరించాలో వివరించారు. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన పలు సమస్యలను వారినివృత్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి రాంబాబు

ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ

మండపేట మండలంలోని ఏడిద గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై ఎంపిడిఒ ఆర్. శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన బాలబాలికలంతా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శి వీర్రాజు, వెలుగు ఉద్యోగులు పాల్గొన్నారు.

'సూర్య ప్రకాష్ విజయానికి కృషి'

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి సూర్య ప్రకాష్ విజయానికి తమ వంతు కృషి చేస్తామని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు బలిజ సంఘం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ అన్నారు. ఆయన శనివారం సూర్యప్రకాష్‌ను వైసిపి కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, సూర్యప్రకాష్‌ను కలిసి మాట్లాడారు. మాజీ శెట్టిబలిజ గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను ఎంపీ బోస్, వైసిపి అభ్యర్థి సూర్యప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ఉన్నారు. సూర్యప్రకాష్ విజయానికి సంఘ నాయకులు కలిసి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.గంగవరంలో కాగడాల ప్రదర్శన

ప్రజాశక్తి-రామచంద్రపురం

పిడిఎస్‌యు-పివైఎల్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కె.గంగవరం లో శనివారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్ ల 93వ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన తో ఘన నివాళి అర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిఎస్‌యు ఉమ్మడి జిల్లా కార్యదర్శి బి.సిద్ధు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి వి. భీమశంకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా, నిరుద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా విద్యార్థులు యువకులు భగత్ సింగ్, రాజగురు,సుఖ దేవ్ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గంగవరం మండలం లోని తహశీల్దార్ కార్యాలయం వరకు కాగడాల

ప్రదర్శనలో పాల్గొన్న పలువురు నాయకులు

ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ ఎఐకెఎంఎస్ నాయకులు అంబటి కృష్ణ, ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజా రెడ్డి, టిలక్లస్, గంగవరం మండల రైతు కూలీ సంఘ నాయకులు కె.వసన్నయ్య, రావి చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పితాని బాలకృష్ణ చేరిక

ప్రజాశక్తి -ముమ్మిడివరం

జనసేన పార్టీ రాష్ట్ర పిఎసి మాజీ సభ్యుడు పితాని బాలకృష్ణ శనివారం సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ మరియు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం లో మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్న సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. అనంతరం అక్కడి నుంచి పలు వాహనాల్లో ర్యాలీగా ముమ్మిడివరం తరలివచ్చారు. వీరి వెంట ముమ్మిడివరం నగర పంచాయతీ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, పెన్మెత్స చిట్టి రాజు, పెయ్యల చిట్టిబాబు, డిల్లీ నారాయణ, కోలా బాబ్జి, తదితర నాయకులు ఉన్నారు.

సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన పితాని బాలకృష్ణ

యానాం వార్తలు

ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫీమ్‌నగర్, కనకాలపేట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్ ను అక్కడి నుంచి శాశ్వతంగా తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను ప్రజలు కోరారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగ, దుర్వాసనను భరించలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే యానాం పర్యటనకు వచ్చిన పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చౌహాన్, ప్రాంతీయ పరిపాలన అధికారి మునిస్వామిలకు స్థానిక ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా తొలగించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం డంపింగ్ యార్డ్‌కు సంబంధించి పనులు జరుగుతున్న నేపథ్యంలో వాటికి ఎలాంటి ఆటంకాలు సృష్టించకుండా ఉండాలని వారికి సూచించారు. గోపాల్ నగర్ లో డంపింగ్ యార్డ్ కి సంబంధించి ఆర్‌ఆర్‌సి యూనిట్ పెట్టాలనే ఉద్దేశ్యం తనకు లేదని అన్నారు. ప్రభుత్వానికి తాను ఎటువంటి నివేదిక ఇవ్వలేదని, ప్రజలకు ఇబ్బంది లేని ప్రాంతంలో పెట్టాలని సూచించినట్లు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చౌహాన్‌కు సమస్యను వివరించి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించితే ప్రజల తరుపున ఉండి పోరాడుతానని స్పష్టం చేశారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు...

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఏకైక పార్లమెంట్ స్థానానికి వచ్చేనెల 19న జరగనున్న ఎన్నిక నేపథ్యంలో శనివారం అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించింది. 26 మంది పోటీలో ఉండగా బిజెపి నుంచి ఎ.నమశివాయం, కాంగ్రెస్ నుంచి వైద్యలింగం, ఎఐఎడిఎంకె నుంచి తమిళ వేందం, బిఎస్‌పి నుంచి అలంగార వేలు, నామ్ తమిళర్ కాచి పార్టీ నుంచి మేనకా, యునైటెడ్ రిపబ్లికన్ పార్టీ ప్రభుదేవన్, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ నుంచి శంకరన్, మరో 18 మంది స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. యానాం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఆరడాది పోసియ్యకు గాజు గ్లాసు గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది.

ఘనంగా నూకాలమ్మ గరగల జాతర

ప్రజాశక్తి - అన్నవరం

మండలంలోని మండపం గ్రామంలో నూకాలమ్మ గరగల జాతర శనివారం ఘనంగా జరిగింది. స్థానిక అత్తివారం ఇల వేల్పుగా కొలిచేవున్న నూకాలమ్మ గరగల రూపంలో రైల్వేస్టేషన్ రహదారికి వచ్చిన సందర్భంగా స్థానిక మహిళలు నేల బిందెలతో వచ్చే పూజారి కాళ్లు కడిగి వడపప్పును నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భాజా భజంత్రీలు, తప్పెట గుళ్ళు, కోలాటాలు జాతర సంబరాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్, ఎంపిటిసి పత్తిబాబు, స్థానిక వైసిపి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూకాలమ్మ జాతర ర్యాలీ

PUBLICATION

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, AMALAPURAM

EP No.12 of 2023 IN OS No: 54 of 2010

(On the file of Subordinate Jude, Yanam)

Between:

Kasi Ravibabu,
S/o.Ramachandra Rao, D.No.7-12-009, GMC Balayogi Nagar, Yanam, Pondicherry State .... D Hr

Vs

Srikakarlapudi Ramachandra Varma
S/o.Venkata Sitaramaraju, President & Correspondent, Vivekananda Public School, Panchala St., Yanam, Pondicherry State .... J Dr

The above named D Hr has instituted the above execution petition against you, and the same stands posted to 29-04-2024 at 10.30 A M for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence experte as per Law.

//by the orders of the Hon'ble court//

Amalapuram
Dt.27-03-2024

D.V.V.S. Murthy
Advocate, Amalapuram
98483 44577

దస్తావేజు పోయినవి

కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం, రాఘవపట్నంకు చెందిన శీరం వీరయ్య, S/o. రాములు అను నాకు ములగపూడి గ్రామ రెవిన్యూ దస్తావేజు నెంబరు 1125/1990, ది.01-02-2024వ తేదీన రౌతులపూడి నుండి కోటనందూరు వెళ్లుచుండగా మార్గం మధ్యలో దస్తావేజులు పోయినవి. ఆ దస్తావేజులు దొరికినవారు ఈ క్రింది అడ్రసును సంప్రదించవలసిందిగా కోరి ప్రార్ధిస్తున్నాను.

శీరం వీరయ్య, S/o. రాములు
రాఘవపట్నం, రౌతులపూడి మండలం
కాకినాడ జిల్లా
సెల్: 8374226900

గ్రామపంచాయతీ కార్యాలయము, మూలస్థాన అగ్రహారం, ఆలమూరు మండలం

ఆర్.ఓ. నెం.06/2024 **టెండరు నోటీసు** తేది.30-03-2024

ఆలమూరు మండలం, మూలస్థాన అగ్రహారం గ్రామపంచాయతీకిగాను ఈ దిగువ తెలిపిన వివరములు గాను ఈ దిగువ సంతకము చేయబడిన వారిచే గాని, వారిచే అధికారము ఇవ్వబడిన వారిచే గాని గ్రామపంచాయతీ కార్యాలయము నందు ది. 02-04-2024వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 01.00 గంIలు వరకు సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే తేదీన మధ్యాహ్నం గంII 3.00లకు హాజరయ్యిన టెండర్‌దారుల సమక్షములో తెరువబడును. టెండర్‌దారులు ముందుగా టెండరు ధరావత్తు చెల్లించి రశీదు టెండరుకు జతపర్చి టెండరు దాఖలు చేయవలెను. మిగిలిన విషయములు ఆఫీసు పనివేళలో అడిగి తెలుసుకొనవచ్చును.

క్ర.సం.	పని వివరము	ధరావత్తు రూ.
1	2024-25 సంIIనకు ప్రజారోగ్య పారిశుధ్య సామాన్లు సరఫరా చేయుటకు	రూ. 100.00
2	2024-25 సంIIనకు వీధిదీపములు సామాన్లు విద్యుత్ లైటులు, పి.డబ్ల్యు.ఎస్. స్కీమ్ సామాన్లు విద్యుత్ లైటులు సరఫరా మరియు ఎలక్ట్రికల్ విధిదీపాలు సరఫరా చేయుటకు	రూ. 100.00
3	01-04-2024 నుండి 31-03-2027 వరకు ప్రజారోగ్య పారిశుధ్య పనుల నిమిత్తం స్వీపరు సేవల నిమిత్తం-5 పోస్టుకు, ట్రాక్టరు డ్రైవర్-1 పోస్టుకు	రూ. 100.00 ఒక్కొక్కటికి
4	01-04-2024 నుండి 31-03-2027 వరకు వాటరు వర్క్స్ ఆపరేటరు-1 పోస్టుకు, ఆఫీసు సబార్డినేట్ సేవల నిమిత్తం-1 పోస్టుకు	రూ. 100.00 ఒక్కొక్కటికి

షరా: 1. సకాలంలో రాని టెండర్లు స్వీకరించబడవు. 2. గ్రామపంచాయతీ నిధుల లభ్యత మేరకు చెల్లింపులు జరుపబడును. 3. సదరు టెండర్లు వాయిదా వేయుటకు గాని, రద్దుపరుచుటకు గాని గ్రామపంచాయతీకి పూర్తి అధికారము కలదు.

సం/- లంక వరప్రసాదరావు, సర్పంచ్ గ్రామపంచాయతీ, మూలస్థాన అగ్రహారం
సం/- పాలంగి రాజు, పంచాయతీ కార్యదర్శి గ్రామపంచాయతీ, మూలస్థాన అగ్రహారం